# ఉపనిషత్తులు

## ఒక అనుశీలన

యస్. వాసుదేవరావు ఐ.పి.యస్.

ఎమెస్కో

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ఉపనిషత్తుల సందేశం | 7 |
| 2. | బ్రహ్మానంద వైభవం (తైత్తిరీయోపనిషత్తు) | 11 |
| 3. | అణువణువూ ఈశ్వరుడే (ఈశావాస్యోపనిషత్తు) | 20 |
| 4. | పరా విద్య – అపరా విద్య (ముండకోపనిషత్తు) | 25 |
| 5. | ఆత్మ – దాని స్వరూపం (కఠోపనిషత్తు) | 32 |
| 6. | మూలాధార శక్తి (కేనోపనిషత్తు) | 43 |
| 7. | ఆత్మయే.... ఆ సర్వేశ్వరుడు (మాండూక్యోపనిషత్తు) | 47 |
| 8. | మహా చైతన్య జ్ఞానమే బ్రహ్మ (ఐతరేయోపనిషత్తు) | 51 |
| 9. | ప్రాణాత్మల ఐక్యతే పరబ్రహ్మ (ప్రశ్నోపనిషత్తు) | 56 |
| 10. | ఆత్మయే ఆ పరబ్రహ్మ (బృహదారణ్యకోపనిషత్తు) | 66 |
| 11. | తత్వమసి (ఛాందోగ్యోపనిషత్తు) | 106 |

# ఉపనిషత్తుల సందేశం

ఉపనిషత్తులు నాలుగు వేదాలకు చివర ఉండటం వలన వాటికి 'వేదాంతం' అన్న పేరు వచ్చింది. వేదాలలో చెప్పబడ్డ కఠిన విషయాలను సరళతరం చేస్తూ సామాన్యులకు కూడా సుగ్రాహ్యమయ్యేలా ఉపనిషత్తులు చెప్పబడ్డాయి.

108 ఉపనిషత్తులలోను క్రింద పేర్కొన్న పదింటిని ప్రధానమైనవిగా గుర్తించారు. 1. ఈశావాస్యోపనిషత్తు 2. కేనోపనిషత్తు 3. కఠోపనిషత్తు 4. ప్రశ్నోపనిషత్తు 5. మాండూక్యోపనిషత్తు 6. ఐతరేయోపనిషత్తు 7. తైత్తిరీయోపనిషత్తు 8. ముండకోప నిషత్తు 9. ఛాందోగ్యోపనిషత్తు 10. బృహదారణ్యకోపనిషత్తు.

దశోపనిషత్తులలో మొదటిదైన ఈశావాస్యోపనిషత్తు ఈ ప్రపంచమంతా ఈశ్వరుడి చేత పరిపూర్ణముగా వ్యాపింపబడి ఉన్నదని తెలియజేస్తుంది. దృశ్య వస్తువులు నిత్యం కాదని, వాటిపై మమత్వాన్ని పెంచుకోవద్దని ఈ ఉపనిషత్తు చెబుతున్నది. శాశ్వతమైన ఈశ్వర తత్వాన్ని పూర్తిగా అనుభవించమని చెబుతున్నది. ఆత్మకు, పరమాత్మకు తేడా లేదు. పరమాత్మ వ్యష్టి రూపం ఆత్మ అయితే, సమష్టి రూపం విశ్వవ్యాప్తమైన స్థావర, జంగమాదులే. కర్మ, జ్ఞాన మార్గాలు అవిభాజ్యాలు. రెండింటినీ సమన్వయించుకొని, వాటి పరస్పర ఆశ్రయత్వాన్ని తెలిసికొని మానవుడు ముందుకు సాగాలి.

కేనోపనిషత్తు 'కేన'? (ఎవని చేత) అన్న ప్రశ్న ఆధారంతో ఇంద్రియాలు, మనస్సుల వెనక ప్రేరణ శక్తిగా ఉన్న బ్రహ్మపరతత్వాన్ని వివరిస్తుంది. ఇంద్రియ నిగ్రహం, తపస్సు ద్వారా పరబ్రహ్మను పొందగలమని ఋషులు తెలియ చేస్తున్నారు.

కఠమహర్షి ద్వారా చెప్పబడ్డ కఠోపనిషత్తు ఆత్మ స్వరూప, స్వభావాలను గూర్చి తెలియజేస్తుంది. లోకంలో ఆకర్షణీయమైనవి (ప్రేయస్సు) హితమైనవి (శ్రేయస్సు) రెండూ మానవుడి దగ్గరికి వచ్చినపుడు, తెలివిగలవాడు హితమైన వాటిని ఎన్నుకుంటాడు. మూర్ఖుడు ఆకర్షణీయమైన జలతారు వలలోపడి చిక్కులు అనుభవిస్తాడు. నచికేతుడికి, యమధర్మరాజుకి మధ్య ఆత్మ విషయమై జరిగిన సంవాదం ఇందులో ప్రధానమైన భాగం. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల కన్నా ఆత్మ వేరైనది.